క్లుప్తంగా

విద్యార్థికి చదువే ముఖ్యం

వినుకొండ(నూజెండ్ల): మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వినుకొండ ప్రాజెక్టు సీడీపీవో ముదివర్తి అనురాధ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్దమసీదు బజారులోని ఉర్దూ హైస్కూల్‌లో బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, భేటి బచావో, బేటి పడావ్ కార్యక్రమాలను నిర్వహించారు. సీడీపీవో అనురాధ, పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ సూపర్‌వైజర్ జి. శేషకుమారి, ఇన్యాసనమ్మ, శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు నీలిమ, నీరజ, రజియా, జాన్వి, షకీలా పాల్గొన్నారు.

బంజారాల అభివృద్ధికి చేయూత

బొల్లాపల్లి: మండలంలోని చక్రాయపాలెం సబ్‌స్టేషన్ ఆవరణలో ఆపరేటింగ్ గది నిర్మాణానికి విరాళం అందజేసిన ఏబీఎస్‌ఎస్ రాష్ట్ర యువ అధ్యక్షుడు జె.రాంబాబునాయక్‌ను గ్రామసర్పంచ్, పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ కె.లక్ష్మానాయక్ మాట్లాడుతూ బంజారాల అభివృద్ధిలో పాలు పంచుకోవడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో జె.రాంబాబునాయక్, గ్రామపెద్దలు బి.బట్టునాయక్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

శావల్యాపురం: ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఉపాధి పథకం పీడీ మతం సిద్ధాలింగమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని గుంటుపాలెం,మతుకుమల్లి, శావల్యాపురం గ్రామాల్లోని జరుగుతున్న ఉపాధి పనులతో పాటు పల్లెపండుగ అభివృద్ధి పనుల పురోగతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వర్సిటీ జూడో జట్టుకు వాగ్దేవి విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జూడో జట్టుకు వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్.మహబూబ్ మస్తాన్ ఎంపికైనట్టు ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. వర్సిటీ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల జూడో పోటీ, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలో మస్తాన్ అండర్-90 కేజీల విభాగంలో ప్రతిభ కనపరిచి జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. ఈనెల 27 నుంచి 30వతేదీ వరకు ఎల్‌ఎన్‌సీటీ భూపాల్‌లో నిర్వహించనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల జూడో పోటీలో ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. మస్తాన్‌ను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వర రావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు అభినందించారు.

రైతుల కోసమే సీసీఐ కేంద్రం

కేంద్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ్ కూరడిగి



గణపవరం సీసీఐ కేంద్రంలో పత్తిలో తేమశాతం పరిశీలిస్తున్న విజయ్ కూరడిగి

నాదెండ్ల: రైతుల వద్ద పత్తిని పూర్తిగా కొనుగోలు చేసే వరకూ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం పని చేస్తోందని, ప్రభుత్వ నిబంధనలను రైతులు అర్థం చేసుకుని, పత్తిని తరలించాలని కేంద్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ్ కూరడిగి చెప్పారు. నాదెండ్ల మండలంలోని గణపవరంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. విజయవాడ రీజియన్ మార్కెటింగ్ శాఖ ఆర్జేడీఎం కాకుమాను శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ జి.రాజశేఖర్, సీసీఐ జనరల్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఏడీఎం కె.సూర్యప్రకాశ్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి యోగేశ్వరరావుతో కలిసి పత్తి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. స్వయంగా ఓ రైతుకు చెందిన పత్తి లోడు ట్రాక్టర్ వద్దకు వెళ్ళి తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, సీసీఐ నిబంధనల మేరకే పత్తి కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. 8–12 శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామని, అంతకు మించిన తేమ ఉంటే కొనుగోలు చేసేందుకు అవకాశం ఉండదన్నారు. పత్తిలో నల్లకాయ ఉన్నట్లయితే అంతర్జాతీయ మార్కెట్లో భారత పత్తికి డిమాండ్ పడిపోతుందని, అందుకే రైతులు పత్తిని ఆరబెట్టి నల్లకాయ లేకుండా తీసుకొస్తే గరిష్ఠంగా క్వింటా రూ.7521లు, కనిష్ఠంగా రూ.7220లకు కొనుగోలు చేస్తామన్నారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. తాము పండించిన పత్తిని ఆరబెట్టుకునేందుకు తమ ఇళ్ళ వద్ద వెసులుబాటు ఉండదని, నిల్వచేసే సౌకర్యాలు కూడా ఉండవన్నారు. తేమ శాతం ఎక్కువన్నా, కాయ తగులుతున్నా ధర తగ్గించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. ప్రస్తుతం పత్తి తీతలు ముమ్మరంగా ఉన్నందున కూలి ధరలు పెరిగాయని, కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్నామని వివరించారు. దీనిపై స్పందించిన సీసీఐ అధికారులు తేమ శాతం 15 వరకు ఉన్నా కొనుగోలు చేసేలా తాము కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించామని, కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీసీఐ బయ్యర్ బి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రాపవుట్స్‌ను తిరిగి బడికి రప్పించండి

- ఉపాధ్యాయులను ఆదేశించిన కలెక్టర్
- గణపవరం జెడ్పీ హైస్కూలులో ఆకస్మిక తనిఖీ



ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటూ ఆర్డీవో మధులత, డీఈవో ఎల్ చంద్రకళ, తహసీల్దార్ ఏవీ రమణ పాఠశాలను సందర్శించారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కృష్ణానాయక్‌తో మాట్లాడారు. గతంలో కన్నా పాఠశాలలో హాజరు శాతం తగ్గిందని, డ్రాపవుట్స్ పెరగటానికి కారణాలను ప్రశ్నించారు. దీనిపై హెచ్‌ఎం మాట్లాడుతూ కరోనా ముందు ఫ్యాక్టరీలు పనిచేసేవని, ప్రస్తుతం ఫ్యాక్టరీలు మూతపడటంతో కార్మికుల పిల్లలు రావటం లేదన్నారు. కార్మికులు స్వస్థలాలకు వెళిపోయారని వివరించారు. డ్రాపవుట్స్ గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల మౌలిక వసతులపై ప్రశ్నించారు. దీనిపై ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరీ లేకపోవటంతో పదో తరగతి పరీక్షా కేంద్రానికి అనుమతి రాకుండా పోతుందని, ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్నారు. అలాగే పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని కోరారు. గ్రామంలో అభివృద్ధి నిలిచిపోయిందని మాజీ సర్పంచ్ వలేటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో గణపవరం గ్రామాన్ని చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేశారని, అయితే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించటంతో స్టేటస్‌కో విధించినట్లు చెప్పారు. అప్పటి నుంచి గ్రామంలో అభివృద్ధి నిలిచిపోయిందని, పంచాయతీ రాజ్ శాఖలో గానీ మున్సిపల్ శాఖలో గానీ ఎలాంటి పనులు జరగటం లేదన్నారు. సిబ్బంది జీత భత్యాలు, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారిందన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతిబాబును కలెక్టర్ ప్రశ్నించగా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల్లోని అన్ని వెబ్‌సైట్‌ల్లో గణపవరం గ్రామం వివరాలు కనిపించటం లేదన్నారు. దీంతో గ్రామాభివృద్ధికి ఆటకం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రాంబాబు, డీటీ ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో రెండు దుకాణాలు దగ్ధం

సుమారు రూ.45 లక్షల నష్టం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని గడియార స్తంభం వద్ద బుధవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. సుమారు 7 గంటల సమయంలో సాంబయ్యకు చెందిన వి మొబైల్ షాపు నుంచి మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న విజయ్‌కుమార్ సైకిల్‌షాపునకూ మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి ఇచ్చిన సమాచారం మేరకు చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే రెండు దుకాణాల్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. రెండింటిలోనూ సుమారు రూ.45 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక అంచనా వేశారు. పట్టణ పోలీసులు దీనిపై సమగ్ర విచారణ చేసి విద్యుత్ షార్ట్‌సర్క్యూటా లేదా మరేదైనా కారణమా అని తేల్చాల్సి ఉంది.

క్యాష్ డిపాజిట్ మెషీన్ ఏర్పాటు

చిలకలూరిపేట: క్యాష్ డిపాజిట్ మెషీన్‌ను ఉపయోగించుకోవాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ సురేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్‌బ్రాంచ్‌లో క్యాష్ డిపాజిట్ మెషీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాదారులు డబ్బులు డిపాజిట్ చేసేందుకు కౌంటర్ ముందు వేచి ఉండే అవసరం లేకుండా వారికి వీలుకలిగిన సమయంలో డబ్బు డిపాజిట్ చేసుకొనేందుకు ఈ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ప్రజారక్షణకు పాటుపడే పోలీసులకు అండగా ఉంటాం

- ఇరువురు హోంగార్డు కుటుంబ సభ్యులకు హోంగార్డులుగా నియామకం
- నియామకపత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



నియామకపత్రాలు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: నిరంతరం ప్రజా రక్షణకై పాటుపడే పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అనారోగ్య కారణాల వలన మృతిచెందిన హోంగార్డు కుటుంబంలోని వ్యక్తులకు హోంగార్డులుగా ఇరువురికి ఉద్యోగ అవకాశం కల్పిస్తూ బుధవారం తన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. స్థానిక ఒన్‌టౌన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఫిబ్రవరి నెలలో అనారోగ్య కారణాల వలన హోంగార్డు సీహెచ్. మల్లికార్జునరావు మృతిచెందారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు మృతుని కుటుంబంలోని అతని కుమార్తె నాగేశ్వరీకి హోంగార్డు ఉద్యోగమిచ్చారు. అలాగే మంగళగిరి బెటాలియన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ, ఏప్రియల్ నెలలో అనారోగ్య కారణాల వలన శరత్‌బాబు మృతిచెందారు. అతని భార్య జాస్నికి నియామకపత్రం అందజేసి హోంగార్డుగా ఉద్యోగం చేసే అవకాశం కల్పించారు. జిల్లా ఎస్పీకి ఆయా కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలియచేశారు. కాగా, హోంగార్డు సిబ్బంది సమస్యలు, కనీస అవసరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడానికి కృషిచేస్తున్న హోంగార్డు ఆర్ఐ కృష్ణను ఈసందర్భంగా అభినందించారు.

గణపవరంలో పర్యటించిన నరసరావుపేట ఆర్డీవో



గణపవరంలో ప్రభుత్వ భూమి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మధులత

నాదెండ్ల: గణపవరం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, అధికారులు చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాలంటూ గ్రామానికి చెందిన ఆవుల సాంబశివరావు ఇటీవల నరసరావుపేట ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో మధులత బుధవారం తహసీల్దార్ ఏవీ రమణ, సర్వేయర్ రాంబాబు, డీటీ ధనలక్ష్మీలతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. సర్వే నెం.216లోని గ్రామ కంఠం కాలువ పోరంబోకు భూమిని పరిశీలించారు. ఈ స్థలంలో నలుగురు వ్యక్తులు ఇళ్ళు నిర్మించుకుని నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్రమించుకున్న నలుగురు వ్యక్తులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి మారుతిబాబును ఆదేశించారు. వారం రోజుల్లో వారి వద్ద ఉన్న ఆధారాలను తీసుకుని ఆర్డీవో కార్యాలయానికి రావాలని ఆదేశించారు. ఆవుల సాంబశివరావు సుమారు 15 ఏళ్ళుగా ప్రభుత్వ స్థలం కాపాడాలంటూ ఉన్నతాధికారులతో పాటూ లోకాయుక్త, న్యాయస్థానాలను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయాలని కోరుతున్నాడు.

పురుగు మందులు వీడితేనే నాణ్యత, దిగుబడి

జిల్లా రైతు శిక్షణ కేంద్రం డీడీఏ శివకుమారి



పొలంబడిలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యడ్లపాడు: పంట ఏదైనా పురుగు మందులు వినియోగం లేకుండా సాగు చేస్తే అటు పంటకు, ఇటు రైతుకు ప్రయోజనమని జిల్లా రైతు శిక్షణా కేంద్రం డీడీఏ శివకుమారి చెప్పారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లోని కంది, మిరప పంటలతో పాటు రబీ సీజన్‌లో శనగ సాగు చేస్తున్న పొలాలను సందర్శించి, రైతులకు పలు సలహాలు, సూచన్లు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందిపంటలో పురుగు మందుల అవసరం లేకుండా చేయడమే జేఏపీ పొలంబడి లక్ష్యమన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చన్నారు. కందిలో వచ్చే రసం పీల్చే పురుగు నివారణకు.. వేపగింజల కషాయం వినియోగించాలన్నారు. 10 కేజీల ఎన్‌ఎస్‌కే ఈలో 10 లీటర్ల నీరు కలిపి 24 గంటలు ఉంచి దానిని వడకట్టి వాడుకోవాలన్నారు. అలాగే రబీసీజన్‌కు శనగ సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు వేరుకుళ్ళు, ఎండుతెగులు నివారణకు..టి విరిడి పిచికారీ చేసుకోవాలని సూచించారు. దీనిని 100 కేజీల పశువుల ఎరువు, 10 కేజీల వేపపిండి, రెండు కేజీల టి విరిడి కలిపి ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ, యడ్లపాడు ఏవో సీహెచ్ సరిత, ఆయా గ్రామాల రైతులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటాలి

స్విమ్మర్లతో జేసీ సూరజ్



కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిసిన కోచ్,స్విమ్మర్లు

నరసరావుపేట: గుజరాత్ రాజ్‌కోట్‌లో నిర్వహించే జాతీయస్థాయి స్విమ్మర్ చాపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించే స్విమ్మర్లు విజయం సాధించి రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ఆకాంక్షించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి ఏడు వరకు నరసరావుపేటలో ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలోని స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన పోటీల్లో బి.హర్షవర్ధన్‌రాజు, ఆర్.హర్షవర్ధనరాజు, కె.శివసాకేత్, పి.రామదయాచంద్, ఎస్.ధీరజ్‌లు రాష్ట్ర స్థాయి స్విమ్మర్లుగా ఎంపికయ్యారు. వీరు ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో స్విమ్మర్లు బుధవారం కలెక్టరేట్‌లో జేసీని కలిశారు. దీంతో ఆయన వారిని అభినందించారు. పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. వీరికి అంకిత భావంతో శిక్షణ ఇస్తున్న కోచ్ జి.సురేష్‌నూ అభినందించారు.

త్రోబాల్ పోటీలకు రొంపిచర్ల విద్యార్థులు

రొంపిచర్ల: పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లాఅండర్- 14 విభాగంలో త్రోబాల్ పోటీలలో రొంపిచర్ల విద్యార్థులు ఎంపిక అయ్యారని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 8వ తరగతి చదువుచున్న విద్యార్థులు ఎస్.ప్రజ్ఞ, పి.చంద్రిక లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని అన్నారు. ఈ నెల 27,28 తేదీలలో చిత్తూరు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు తరపున పాల్గొని ఆడతారని అన్నారు. రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక అయిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

ఈశ్వర్ ఎండీ మస్తాన్ షరీఫ్‌కు డాక్టరేట్

నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ మస్తాన్ షరీఫ్ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ డిగ్రీని పొందారు. ఆక్యుపేషనల్ స్ట్రెస్ అండ్ ఇట్స్ ఇన్ఫ్లుయెన్స్ ఆన్ వర్క్ లైఫ్ బాలన్స్ అమాంగ్ టీచర్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ ఇన్సిట్యూషన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి డాక్టరేట్ అందజేశారు. పరిశోధనకు గైడ్ ప్రొఫెసర్‌గా జాలాది రవి వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టరేట్ పొందిన మస్తాన్ షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు.

కరపత్రాలు పంపిణీ

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో బుధవారం ఏఐకెఎస్, ఏఐటీ యూసీ, సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ప్రదర్శన, ధర్నా కార్యక్రమంలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద వీవోఏల ధర్నా



కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, వీవోఏలు

నరసరావుపేట: రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు తొలగించిన వెలుగు వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో మురళికి వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ పెదకూరపాడుతోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటివరకు పనిచేస్తున్న వీవోఏలను రాజకీయ కారణాలతో తొలగించారని విమర్శించారు. వారందరూ హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం స్టే ఇచ్చిందన్నారు. స్టే ఉత్తర్వులు చూపించినా జిల్లాలోని పీడీ, ఏపీఎంలు వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోలేదని ధ్వజమెత్తారు. కాలపరిమితి జీవోను రద్దు చేయాలని, వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి పడిన జీతాలను వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, మహిళా మార్టుల్లో బలవంతపు కొనుగోళ్లు నిలుపుదల చేయాలని కోరారు. సీహెచ్.వి.రమణ, బి.భాస్కర్, కె.మేరి రోహిణి తదితర వీవోఏలు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు ముందస్తు ఏర్పాట్లు

- ఫిబ్రవరి 26న తిరునాళ్ల మహోత్సవం
- ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- రూరల్ పోలీసులతో సమీక్షించిన డీఎస్పీ కె.నాగేశ్వరరావు



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్ల రాష్ట్ర పండుగకు పోలీసు శాఖ ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో నిర్వహించే జాతర పోలీసు శాఖ సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు రూరల్ పోలీసు స్టేషన్ అధికారులకు ఆదేశాలు జరిచేసినట్టు చెప్పారు. తిరునాళ్ల బందోబస్తు, కొండకు వెళ్లే దారులు, చెక్‌పోస్టులతో పలు అంశాలపై క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులు పర్యటించి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గతంలో ఉన్న అనుభవాలను పరిగణలోకి తీసుకొని యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా ప్రశాంతంగా జాతర ముగిసే విధంగా పోలీసు శాఖ సన్నద్ధమవుతుందని చెప్పారు. కార్తికమాసంలో కోటప్పకొండకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డివిజన్‌లోని పోలీస్ అధికారులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే శృంగేరీ ఉపపీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతీ మహాస్వామి గురువారం కోటప్పకొండను సందర్శించనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. గంజాయి, కల్తీ ఉత్పత్తుల నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలతో చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించి గంజాయి, కల్తీ ఉత్పత్తులపై సమాచారాన్ని అందించాలని కోరారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో గీతమ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఎ.అనూరెడ్డి, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలా రామ్, రిటైర్డ్ హెచ్‌ఎం రవికుమార్, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి భూక్యా బద్రీనాయక్ పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని మంచి విజ్ఞానాన్ని పొందాలని శ్రీరామా పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కె.వి.ఆర్. మోహన్‌చందు అన్నారు. బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలు శావల్యాపురం గ్రంథాలయ శాఖలో నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఆటలు, పాటలు, క్విజ్ తదితర పోటీల్లోని విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్, శ్రీనివాససింగ్, శ్రీరాములు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో చివరి రోజు విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జి.వేణు, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు కె.అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు : మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో గల శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వి.సాంబనాయక్, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం కె. శ్రీనునాయక్‌లు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్. నాగలక్ష్మి, గ్రామపెద్దలు సూరె వెంకటనరసయ్య, నర్రా శ్రీనివాసరావు, పూట్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖ గ్రంథాలయ అధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ముగింపు ఉత్సవంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక జీడీసీసీ బ్యాంకు మేనేజర్ మిరియాల కోటేశ్వరరావు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం కె. విజయకుమారి, కేజీబీవీ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీలు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు.

నరసరావుపేట ఈస్ట్: గ్రంథాలయాలను విద్యార్థులు తరచు సందర్శిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వక్తలు తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో బుధవారం 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. సభకు గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ అధ్యక్షత వహించారు. సభలో మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తూమాటి రవికాంత్, బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం బి.నిర్మలాబాయ్, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి పాల్గొన్నారు.